రైతన్న జర జాగ్రత్త

- ఆదమరిస్తే ప్రాణాలు హరి..
- వర్షాకాలంలో మోటార్లు, విద్యుత్ తీగలతో జాగ్రత్త అవసరం
- పొలం వెళ్లే రైతన్నలు జాగ్రత్తగా ఉండాలంటున్న విద్యుత్ అధికారులు


పొలంలో ఏర్పాటు చేసిన మోటారు

అద్దంకి: వర్షాకాలంలో రైతన్నలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. బోర్ల కింద సాగుకు సమయం మించినా తప్పనిసరి పరిస్థితుల్లో సమాయత్తం అవుతున్నారు. ఈ క్రమంలో తమ పొలంలో వేయించిన బోరు తాలూకు మోటార్లు, తీగ ఎలా ఉన్నాయో పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖ అధికారులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఎక్కువ మంది రైతులు చిన్నచిన్న మరమ్మతులను పట్టించుకోకుండా ఈక్రమంలో జాగ్రత్తలు తీసుకోకుంటే మోటార్లను వేయడానికి వెళ్లే రైతులు మృత్యువాత పడే అవకాశం ఉంది. పొలాల్లో కర్ర స్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏ కొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా ప్రమాదం సంభవించే అవకావం ఉందని విద్యుత్ అధికారులు అంటున్నారు.

కవర్లు లేని మోటార్లతో..

రైతులు తక్కువ ధరలకు మోటార్లను కొనుగోలు చేసి వాడుతుంటారు. అదే విధంగా కొందరు మోటార్లను ఆరుబయట, బావి ఒడ్డు, కాల్వ ఒడ్డున ఉంచి చిన్న కవర్లను కప్పుతుంటారు. కొన్ని రోజులకు అవి దెబ్బతినడం, తరువాత వాటిని పట్టించుకోకపోవడంతో మోటార్లు తడిసిపోతాయి. దీంతో విద్యుత్ సరఫరా కావడంతో స్విచ్ ఆన్ చేసే సమయంలో షాక్ కొట్టే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

ఇనుప డబ్బాలతోనూ ప్రమాదం..

చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్లు, ఫీజులు బిగింపు కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తుంటారు. ఈ క్రమంలో ఎలుకలు అందులోకి వెళ్లి తీగలను కొరికేయడం వలన డబ్బాలకు తీగలు అంటుకుని విద్యుత్ ప్రవహించి పట్టుకోగానే షాక్ కొట్టే ప్రమాదం ఉంటుంది.

తెగిన తీగలతో..

గాలివానల సమయంలో ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు గాలి వానలకు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యయసాయ పనులు ముగిసిన వెంటనే పొలంలో నుంచి విద్యుత్ తీగలను తీసుకు వచ్చి ఇళ్లలో తీగలను కట్టకట్టి దాస్తుంటారు. ఆ సమయంలో ఆ తీగలను ఎలుకలు కొరికితే గమనించకుండా తీసుకెళ్లి వాటిని మోటార్లకు బిగించడం వలన, రైతులు కూలీలు తీగలున్న ప్రాంతాల్లో తిరిగి కాలికి తగిలితే షాక్‌కు గురై మృతిచెందే అవకాశం ఉంది. రైతులు ఏదైనా పాత తీగలను, లేదా కొత్త తీగలను బిగించే సమయంలో పరీక్షించి బిగించుకుంటే ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు. కొందరు రైతులు విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్నప్పుడు మధ్య మధ్యలో కర్రలను ఏర్పాటు చేసుకుని ఆ కర్రలకు తీగలను కడుతుంటారు. ఇవి అప్పుడప్పుడు వర్షం గాలులకు కిందపడి పడి ఉంటాయి. వాటిని గమనించకుంటా పొలంలో పనులు చేసే సమయంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యే అవకాశం ఉన్నంది. రైతులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పొలాల్లో విద్యుత్ పనిచేయకుంటే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సాయంతో పరిశీలించాలి.
- వర్షం నీరు తగలని చోట మోటార్లను అమర్చుకోవాలి.
- ప్రతి మోటారుకు ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండాలి.
- మోటారుకు ఏదైనా మరమ్మతులు చేయించాలంటే ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపేయాలి.
- స్టార్టర్లను పొడి ప్రదేశంలో మోటారుకు దగ్గర ప్రదేశంలో అమర్చుకోవాలి. రక్షణ కవర్‌లను తీసివేయకూడదు.
- నేరుగా స్టార్టర్‌లను విద్యుత్ సరఫరా కాకుండా మధ్యలో ఫీజు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.
- సొంత మరమ్మతులు చేయకుండా మెకానిక్‌ను తీసుకుని వెళ్లి చేయించువాలి.
- స్టార్టర్ డబ్బాలకు తలుపులు ఉండేలా చూసుకోవాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి..

విద్యుత్ తీగలు మోటార్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పనులు ప్రారంభించే సమయంలో మోటార్లకు అమర్చిన వైర్లను తప్పనిసరిగా పరీక్షించుకోవాలి. లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలను తీసుకుని అప్రమత్తంగా ఉండడం వల్ల ప్రమాదలను నివారించుకోవచ్చు.

– దీఈ సత్యనారాయణ

పాఠశాలల రికార్డుల అప్‌డేట్ తప్పనిసరి


చందలూరు పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న చీరాల డిప్యూటీ డీఈవో నిర్మల


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు

స్వర్ణ (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల అన్ని రకాల రికార్డులను ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని ఎంఈఓ–2 మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వార విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాలు, పుస్తకాలు, కిట్లు వంటి పంపిణీ వివరాలను సైతం ఆయన పరిశీలించారు. విద్యాబోధనల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎంత వరకు అర్థమవుతున్నాయనే విషయంలోను ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో కలసి ఆయన భోజనం చేశారు. ప్రతి రోజు మెనూను కచ్చితంగా అమలు చెయ్యాలని ఆయన కుకింగ్ నిర్వాహకులను ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవన్నారు. రుచి, శుచి విషయంలో రాజీ వద్దన్నారు. మంచి పోషకవిలువలు ఉండే ఆహారాన్ని విద్యార్థులు తప్పకుండా తినాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఉప విద్యాశాఖ అధికారి ఎం నిర్మల ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ కంటెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గిరిజ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు


ఉప్పుమాగులూరులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బల్లికురవ: సీజనల్ వ్యాధులు సోకకుండా నవంబర్ వరకు గ్రామాలను స్పెషల్ డ్రైవ్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వై హనుమారెడ్డి కోరారు. శుక్రవారం ఉప్పుమాగులూరు, కొప్పరపాలెం గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులకు ఆయన పరిశీలించారు. సైడు కాలువల్లో మురుగు నిల్వలు లేకుండా వ్యర్థాలను గ్రామాలకు దూరంగా చెత్తనుంచి సంపద కేంద్రాలకు తరలించాలని సెక్రటరీలను ఆదేశించారు. అనంతరం రెండు గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. అటెండెన్స్, మూమెంట్ ఫిర్యాదుల రిజిస్టర్‌లను పరిశీలించారు. సచివాలయల్లో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులంతా విధులు, బాధ్యతలు గుర్తెరిగి ప్రజలకు అందుబాటులో ఉంటు సేవలు అందించాలన్నారు. తనిఖీలో ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సీహెచ్‌కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జే.పంగులూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేడు సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో మాథ్యూబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరగనున్నందన్నారు. ఈసమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు. ప్రజా సమస్యలపై చర్చించి, పరిష్కార మార్గం జరిగే విధంగా సమావేశం జరగాలన్నారు.

వీరుల పోరాటంతోనే కార్గిల్ విజయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధి గౌతమ్ కుమార్


అద్దంకిలో మాజీ సైనికులను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

చీరాల అర్బన్: వీరుల పోరాటంతోనే కార్గిల్ విజయం సాధించామని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి గౌతమ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ విజయోత్సవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దుల్లో వీరుల అవిశ్రాంత పోరాటంతోనే దేశ ప్రజలందరూ ప్రశాంతంగా ఉన్నారన్నారు. ప్రపంచంలో అనేక దేశాల మధ్య యుద్ధాలు జరిగినప్పటికీ కార్గిల్ యుద్ధం మాత్రం అరుదైనదన్నారు. కొండలపైన పాకిస్తాన్ సైనికులు ఉంటే కొండ కింద ఇండియా సైనిక దళం ఉందన్నారు. ఈ యుద్ధం మే నెలలో ప్రారంభమైనప్పటికి జులై 26 తేదీన త్రివర్ణ పతాకాన్ని ఇండియా సైనికులు కార్గిల్ భూభాగంలో ఎగురవేశారన్నారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా ప్రతినిధి మణికుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ రజతోత్సవ విజయ్ దివస్..

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ సభను ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా రోటరీ అధ్యక్షుడు వీరయ్య అధ్యక్షతన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దానిలో భాగంగా మాజీ సైనికులు శేషారెడ్డి, సుబ్బారావు, రత్తయ్య, నాగేశ్వరరావులను ఘనంగా సన్మానించారు.


మార్టూరులో కార్గిల్ వీరులను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

కార్యక్రమంలో చిన్న మురళీకృష్ణ, లెవీ ప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అళహరి హరిప్రసాద్, పాల్గొన్నారు.

మార్టూరు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొని విజయం సాధించిన సైనికులను సన్మానించారు. పెనుబోతు హనుమయ్య, కొప్రపాటి కిషోర్ కుమార్, బీవీ.రామారావు, అమరనేని శ్రీనివాసరావు, పావులూరి చౌదరి, సందిపోగు డేవిడ్, బిల్లా భాస్కరరావు ఏడుగురు సైనికులను పూలమాలలు, శాలువాలతో సన్మానించి మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ మాదాల సాంబశివరావు, కోటేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని యువతికి గాయాలు

అద్దంకి రూరల్: ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువతిని ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొట్టిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు అద్దంకి పట్టణంలో సీటి కేబుల్‌లో యాంకర్‌గా పని చేస్తున్న కెజియారాణి ద్విచక్రవాహనంపై వెళ్తోంది. ఈక్రమంలో వేలమూరిపాడు వెళ్లేదారిలో రామ్‌నగర్ వద్ద బస్సు ఢీకొట్టింది. దీంతో యువతికి స్వల్పగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

శిక్షా సప్తాహ్‌లో విద్యార్థుల శ్రమదానం


పరిసరాల పరిశుభ్రతలో చిన్నారులు, ఉపాధ్యాయులు

కుంకలమర్రు (కారంచేడు): మా పాఠశాల పరిసరాల పరిశుభ్రతలో మా వంతు సేవ అందిస్తామంటూ చిన్నారులు తమ చేతులు కలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సాంకేత నైపుణ్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర, పోషణ దినోత్సవం, అమ్మపేరుతో అమ్మతో కలసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మండలంలోని కుంకలమర్రు చర్చి కాంపౌండ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంయుక్తంగా నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా పిచ్చి మొక్కలు పీకేసి, గడ్డిని తొలగించారు. చెత్తా, చెదారాలను కాల్చివేశారు. అనంతరం తల్లిదండ్రులతో కలసి మొక్కలు నాటి అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. మంచి సేవలందించిన చిన్నారులకు ఉపాధ్యాయులు చిన్నచిన్న బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్యామల, నాగమణి, వీ బాబూరావు, విద్యార్థులు, కుకింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థికి రూ. 2 లక్షల సాయం

అద్దంకి: ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకు సాధించిన విద్యార్థికి దాత ఆర్థిక సాయం చేశారు. ఆలిండియా ఎలక్ట్రికల్ కమ్యునికేషన్‌లో రెండో ర్యాంకు సాధించిన విద్యార్థి రవితేజకు పట్టణానికి చెందిన రిటైర్డ్ జడ్జి కొత్తమాసు మురళీకృష్ణ అచ్యుతరావు రూ.2 లక్షల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఆయనను అద్దంకి మండల ఆర్య వైశ్య సంఘం తరుపున మండల ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు రామకోటేశ్వరరావు అభినందనలు తెలియజేశారు.

క్లుప్తంగా

కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

చీరాల: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చిన కేటాయింపులపై శ్వేత పత్రం విడుదుల చేయాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నేత చిమటా సాంబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం అమరావతి నిర్మాణానికి కేటాయించిన రూ.15 వేల కోట్లు అప్పుగా ఇచ్చిందో, గ్రాంట్‌గా ఇచ్చిందో స్పష్టత లేదని, పోలవరం పూర్తికి ఎంత కేటాయించారో బడ్జెట్‌లో లేదన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరించడంపై స్పష్టంగా చెప్పకపోవడం, విశాఖ రైల్వే జోన్ పూర్తి చేస్తామని ఏదీ స్పష్టంగా చెప్పలేదన్నారు. అలానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు మాట్లాడడం అవకాశవాద రాజకీయాలకు అద్దం పట్టినట్టుగా ఉందన్నారు. అసెంబ్లీలో బలపరచింది చంద్రబాబే, రద్దు చేసింది చంద్రబాబేనని, ల్యాండ్ యాక్టు ప్రతిపాదించిన బీజేపీ పార్టీతో పొత్తు పెట్టుకుని జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో పంజాబ్ ఇంకా కొన్ని రాష్ట్రాలలో, ఆస్ట్రేలియా దేశంలో కూడా ఈ యాక్టు అమలులో ఉందని, మన రాష్ట్రానికి ఈ యాక్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మేదరమెట్ల: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి శారత డిమాండ్ చేశారు. కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అద్దంకి మండలంలోని మోదేపల్లి, కలవకూరు సెక్టార్ల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలు గత ప్రభుత్వం హయంలో 42 రోజులు సమ్మె కాలంలో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. అద్దంకి మండలంలోని మోదేపల్లి కలవకూరు సెక్టార్ల సమావేశం కొరిశపాడులోని ప్రాజెక్ట్ ఆఫీసులో నిర్వహించారు.

బైకును ఢీకొట్టిన ఆటో


క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్ ఎక్కిస్తున్న సిబ్బంది

జే.పంగులూరు: వేగంగా వెళ్తున్న ఆటో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని బైటమంజులూరు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. హైవే సిబ్బంది వివరాల మేరకు.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం తాళ్లూరుకు చెందిన టి మణికంఠ అనే ఆటో డ్రైవర్ తన ఆటోతో గుంటూరు నుంచి మేదరమెట్లకు జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. మండల పరిధిలోని బైటమంజులూరు సమీపంలోకి వచ్చేసరికి ముదు వెళ్తున్న బైకును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న ఆటో డ్రైవర్‌కు, గుంటూరు జిల్లా మేడికొండూరు గ్రామానికి చెందిన కే శివ పార్వతి అనే మహిళ కాలికి తీవ్ర గాయమైంది. బైకు మీద ఉన్న మండల పరిధిలోని ముప్పవరం గ్రామానికి చెందిన కుంచాల శివకృష్ణలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ పై చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆయుర్వేద వైద్యుడికి సన్మానం


వెంకయ్యను సన్మానిస్తున్న మస్తాన్‌వలి, కరిముల్లా

మార్టూరు: ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, నంది అవార్డు గ్రహీత మండలంలోని రాజుగారిపాలెం గ్రామస్తుడు డాక్టర్ కొండపల్లి వెంకయ్యను శుక్రవారం మార్టూరులో ఘనంగా సన్మానించారు. స్థానిక గన్నవరం రోడ్డులో గల మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గద్దం మస్తాన్‌వలి కార్యాలయంలో ఎన్నో ప్రముఖ సేవా సంస్థల ద్వారా 24 అవార్డులు అందుకున్న సందర్భంగా వైద్యరత్న కొండపల్లి వెంకయ్యను స్థానికులు ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ కరిముల్లా స్థానికులు పాల్గొన్నారు.

అస్వస్థత ఉంటే పరీక్షలు చేసుకోవాలి

బల్లికురవ: జలుబు, దగ్గు, జ్వరంతో అస్వస్థతకు గురైతే తక్షణమే క్యాంప్‌కు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ అధికారి షేక్ రమీజ్ అహమ్మద్ కోరారు. అంబడిపూడి గ్రామంలో అపరిశుద్ధ్యంతో జ్వరాలు సోకుతున్నందున 20 రోజులుగా ఇంటింటా సర్వేతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం గ్రామంలోని ఎస్సీ కాలనీ, చర్చి వద్ద శిబిరంలో భాగంగా జ్వర పీడితులకు పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాకటంతో పాడు వేడివేడి ఆహారం తీసుకోవాలని, నిల్వ ఉన్న ఆహారాలు తినవద్దని వైద్యాధికారి వివరించారు. పరీక్షల్లో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం

- మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: చేనేతలకు ఆరాధ్యదైవంగా, చేనేత పితామహుడుగా ప్రగడ కోటయ్య చరిత్రలో నిలిచిన మహోన్నత వ్యక్తి అని చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కొనియాడారు. ప్రజాబంధు ప్రగఢ కోటయ్య 110వ జయంతిని అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కోటయ్య కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం, చేనేత నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కరణం బలరాం మాట్లాడుతూ కోటయ్య విద్యావేత్తగా, రాజకీయ నేతగా, పోరాట యోధుడిగా పేరుగాంచారన్నారు. విద్యాభివృద్ధితో పాటుగా సమాజాభివృద్ధి, రైతాంగానికి నీటి కష్టాలు లేకుండా పంపింగ్ స్కీం, వేటపాలెంలో స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేయించి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. రైతులకు, చేనేతలు, విద్యార్థుల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ప్రజాబంధుగా కీర్తి గడించిన కోటయ్య సేవలు ఎన్నటికి మరువలేనివన్నారు. చేనేతలకు అంతర్జాతీయ ఖ్యాతి, గుర్తింపు వచ్చేలా చేసిన కోటయ్య సేవలను ఎన్నటికి మరువకూడదన్నారు. ప్రతి ఏటా జయంతి, వర్ధంతిలను నిర్వహిస్తున్న అసోసియేషన్ అధ్యక్షులు దామర్ల శ్రీకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఎ.అంకాళరెడ్డి, చేనేత నాయకులు మాచర్ల మోహనరావు, అవ్వారు మునలయ్య, ప్రగఢ శేషశయన, మున్సిపల్ కౌన్సిలర్లు మామిడాల రాములు, తోకల అనీల్, గోలి జగదీష్, బి.అనీల్, కె.వెంకటరావు, జి.ఎబినేజర్, ఎం.లలిత, గుంటూరు ప్రభాకరరావు, యాతం మేరిబాబు, షేక్ కబీర్, కె.ప్రసాద్‌రెడ్డి, బాలకృష్ణ, మహమ్మద్‌నూర్, శ్రీను తదితరులు ఉన్నారు.

అపరిశుభ్రతకు నిలయాలు కార్యాలయాలు

చీరాల టౌన్: వర్షాలు కురుస్తున్నాయి. సీజనల్ వ్యాదులు ప్రభలే ఆస్కారం ఉంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరు కర్తవ్యంగా తీసుకోవాలి. అధికారులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్తా చెదారాలను లేకుండా చూడాలని జిల్లా అధికారులు ఆదేశించినప్పటికి ఆచరణ మాత్రం పూర్తిగా భిన్నం. చీరాల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో చెత్తకుప్పలు, దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. ఫలితంగా కార్యాలయాలకు వివిధ పనులపై వస్తున్న జనం అవస్థలు పడుతున్నారు. కనీసం కార్యాయాల ఆవరణలో ఉన్న చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. చీరాల రెవెన్యూ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం చుట్టూ మెండుగా ఉన్న చెత్తాచెదారాలను తొలగించేందుకు అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదు. కార్యాలయాల చుట్టు చెత్తాచెదారాలు, మురుగు నీరు, నిరుపయోగంగా ఉన్న వస్తువులతో అపరిశుభ్రత కలిగిన పరిసరాలు ఏర్పడ్డాయి. తహశీల్దార్ కార్యాలయం చిల్లచెట్లు పెరిగిపోవడంతో కీటకాల తాకిడిగా ఉందని కార్యాలయాలకు వచ్చే ప్రజలు చెబుతున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంపై అధికారులు నామమాత్రంగా కూడా దృష్టి పెట్టకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ దుర్గంధభరితంగా తయారయ్యాయి. మండలస్థాయి అధికారులు కార్యాలయాలను ఏవిధంగా నిర్వహిస్తున్నారో అర్థమవుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు.


చెత్త కుప్పలు, వ్యర్థాలతో నిండిన వర్షపాతం కొలిచే సిగ్నల్ యంత్రం, ఆవరణ

మడ అడవుల పెంపకంతో తీరప్రాంత రక్షణ

వేటపాలెం: సముద్ర తీరం వెంట మడ అడవుల పెంపకం తీరప్రాంత రక్షణగా ఉపయోగ పడతాయని ఫారెస్ట్ సెక్షన్ అధికారి వై జాన్సన్ పేర్కొన్నారు. మండలంలోని పొట్టిసుబ్బయ్యపాలెం బీచ్ వద్ద ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్, అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మడ అడవుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం పరిరక్షణలో మడ మొక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఐటీసీ ప్రోగ్రాం మేనేజర్ గౌరి నాయుడు మాట్లాడుతూ సముద్ర తీరప్రాంత గ్రామాలకు మడ అడవులు, సముద్ర తాబేళ్ల మిత్రులని పేర్కొన్నారు. సునామీల నుంచి సముద్ర తీరానికి రక్షణ పొందాలంటే మడ అడవులను పెంచుకోవాలన్నారు. మత్స్య సంపద కూడా మడ అడవులు ఉన్న ప్రాంతాల్లో అధికంగా ఉంటుందని తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీరాల ఐటీసీ హెచ్ఆర్ మేనేజర్ సీజే విజయలక్ష్మి, సేఫ్టీ అధికారి ఎంఎస్ న్‌రెడ్డి, నిరంజన్, డీ సాయిగౌతం, బీట్ అధికారి బి శిరీష, ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి పాల్గొన్నారు.


మడ అడవుల పరిరక్షణ దినోత్సవానికి హాజరైన అధికారులు

మాదక ద్రవ్యాలతో భవిత బుగ్గిపాలు

అద్దంకి: మాదక ద్రవ్యాలు వాడటం వల్ల విద్యార్థుల భంగారు భవిత బుగ్గి పాలు అవుతుందని న్యాయవాదులు పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ అద్దంకి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలు, సంబంధిత చట్టాల గురించి విద్యార్థులకు న్యాయవాదులు ఖీ మార్త శ్రీనివాస్, షేక్ మహ్మద్ రఫీ ఎం ప్రకాష్, గృహలక్ష్మి అవగాహన కల్పించారు. అదే విధంగా హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకత, మార్గదర్శకాలు, సైబర్ క్రైమ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీరత్తయ్య, ప్రిన్సిపాల్ పెద్ద రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయవాది మహ్మద్ రఫీ



